క్లుప్తంగా

ఘనంగా కాపు వనసమారాధన



టాపర్ ప్రత్యూషను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నాయకులు

కాళ్ల: తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తే అది కోట్ల ఆస్తితో సమానమని గ్రూప్–1 టాపర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ గణేశ్న భానుశ్రీ లక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష అన్నారు. కాళ్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం కార్తీక వనసమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కాపు సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు పుప్పాల నరసింహారావు (బుజ్జి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ కాపు కుల అభ్యున్నతికి పాటు పడుతూ ఇతర కులాలను గౌరవించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులై ఉన్నత స్థానాలు సాధించిన ప్రతిభావంతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నాయకులు కొటికలపూడి చినబాబు, ముత్యాల రత్నం, నార్ని తాతాజీ, కాపు సంఘం జిల్లా అధ్యక్షులు చినిమిల్లి వెంకటరాయుడు, పారిశ్రామికవేత్త వానపల్లి బాబురావు తదితరులు మాట్లాడారు. కట్రెడ్డి శ్రీనివాస్, కోరా రామ్మూర్తి, చిన్నాపరపు రాంబాబు, ఆరేటి తాతాపండు, వివిధ పార్టీలోని కాపు ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

28 నుంచి రెండో విడత 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఉండి: రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం మండలంలో రెండో విడత షెడ్యూల్‌ను ఖరారైనట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆదివారం చెప్పారు. ఈ నెల 28న చిలకుకూరు, 29న కలిగొట్ల, 30న ఎన్నార్పీ అగ్రహారం, డిసెంబర్ 1న పాందువ్వ, 4న పెదపుల్లేరు, 5న ఉండి–2లో, 6న ఉణుదుర్రు, 7న ఉప్పులూరు, 8న వాంద్రం, 11న యండగండి–2లో, 12న ఉండి–3లో జగనన్న ఏపీకి ఎందుకు కావాలి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆంజనేయరాజు కోరారు.

మోదీ గో బ్యాక్ అంటూ నిరసన

భీమవరం: రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నమ్మించి మోసం చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గోబ్యాక్ అంటూ పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో ఆదివారం వామపక్షాల ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లతో ఆందోళన చేపట్టారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు బి.బలరామ్, కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామని, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరానికి నిధులు ఇస్తామని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనపెట్టి మాయమాటలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పట్ల నరేంద్రమోదీకి ఏమాత్రం గౌరవం లేదని స్పష్టమైందన్నారు. నాయకులు జేఎన్‌వీ గోపాలన్, బి.వాసుదేవరావు, చెల్లబోయిన రంగారావు, మల్లుల సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారుడికీ చేరాలి



బేతపూడి సభలో మాట్లాడుతున్న ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు

భీమవరం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు చివరి ప్రాంత లబ్ధిదారులకు చేరే విధంగా అధికారులు చూడాలని ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు అన్నారు. భీమవరం మండలంలోని బేతపూడి, తుందుర్రు గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయన్నారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, సున్నా వడ్డీ, రుణమాఫీ అమలు చేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సున్నా వడ్డీకే రుణాలు అందిస్తున్నారన్నారు. గర్భస్థ శిశువు నుంచి 6 ఏళ్ల వరకు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. ప్రజలకు సేవలు చేసేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు చిట్టచివరి ఆవాసా ప్రాంతాలకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీపీవో మల్లికార్జునరావు, డీఎంహెచ్‌వో మహేశ్వరరావు, జిల్లా లింక్ బ్యాంక్ మేనేజర్ ఏవీ ప్రసాద్, తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీవో కె. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు జగన్ కృషి

- పెదఅమిరం సభలో పీవీఎల్, లక్ష్మి
- అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులు
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



పెదఅమిరం సభలో మాట్లాడుతున్న పీవీఎల్, చిత్రంలో శ్రీలక్ష్మి



వీరవాసరంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉండి: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. ఆదివారం కాళ్ల మండలం పెదఅమిరంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో 62వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పీవీఎల్, శ్రీలక్ష్మి, శ్రీనివాసరాజు మాట్లాడుతూ భాతర జాతికి దిక్సూచీ వంటి రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భాతరజాతి ముద్దుబిడ్డ అయ్యారని అన్నారు. సమాజంలో వెనుకబడిన వారికి తగిన గుర్తింపు, హోదా ఇచ్చి వారికి తగిన గౌరవాన్ని ఇచ్చారన్నారు. అలాగే వారికి ఓటు హక్కు కల్పించడంతో పాటు రాజకీయంగా పురోభివృద్ధికి కారకులయ్యారన్నారు. రాజ్యాంగ బద్ధంగా వారికి రిజర్వేషన్లు కల్పించడం వల్లనే ఈరోజు అనేకమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గాలకు చెందిన అనేక మంది ఉన్నత పదవులను అలంకరిస్తున్నారన్నారు. రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులకు ప్రత్యేక కార్పోరేషన్‌లు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఉన్నత స్థాయి పదవులు కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కట్టబెట్టిన మహోన్నత నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బీసీలకు వెన్నుముకగా నిలుస్తూ సామాజిక సాధికారత బస్సు యాత్రలను రాష్ట్రమంతా నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా త్వరలోనే ఉండి నియోజకవర్గ ఆకివీడులో బస్సుయాత్ర నిర్వహిస్తామని అన్నారు. దానికి పెద్ద ఎత్తున ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలు తరలివచ్చి జయప్రదం చేయాలని జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని చాటుకోవాలని అన్నారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, వైఎస్సార్‌సీపీ జెండాను ఉండిలో ఎగురవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల, ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపార్టీల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కాళ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ టీఏ కృష్ణారావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బహుజన సమాఖ్య ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఆదివారం కాళ్లలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యున్నతమైనదని, అలాంటి రాజ్యాంగాన్ని అందించిన ఘనత డా.బీఆర్ అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సోడదాసి గంగయ్య, కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గం ఇన్చార్జి వేగేశ్న గోపాలకృష్ణంరాజు, సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

భీమవరం: విద్యార్థులంతా అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని న్యాయవాదులు కె.జ్యోతి, డి.రవికుమార్ అన్నారు. భీమవరం 12వ వార్డులోని బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హాస్టల్ వార్డెన్లు శ్యామల, భానుమణి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘురామ్, ఐఏఎల్ అధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, వీర్రాజు పాల్గొన్నారు. పట్టణంలోని 36వ వార్డు సోషల్‌వెల్ఫేర్ హాస్టల్‌వద్ద దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారానే ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అందిందన్నారు. సతీష్‌కుమార్, ఉండ్రు రాజ్‌కుమార్, దొడ్డిగర్ల మనోజ్, కె.ఏసుబాబు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

భీమవరం: స్వేచ్ఛ, సమానత్వం రాజ్యాంగం మూల స్తంభాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బైక్ ర్యాలీని దేవానంద్ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవించి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ పనిచేయాలన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా బైక్ ర్యాలీ చేపడుతున్నామన్నారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంజేటి వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల కపర్ది, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కాయిత సురేంద్ర, రాంబాబు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఔన్నత్యంపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మునిసిపల్ కార్యాలయంలో మెప్మా స్వయం సహాయక సభ్యులకు, రిసోర్స్ పర్సన్లకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగం ఆవిర్భావం, అంబేడ్కర్ కృషి, రాజ్యాంగ ఔన్నత్యంపై సభ్యులకు సీఎంఎం నాయకులు నానిబాబు వివరించారు. పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ కృపామణి మహిళల హక్కులపై అవగాహన కల్పించారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు

వీరవాసరం: రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా వీరవాసరంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సర్పంచ్ చికిలే మంగతాయారు, తాడి రాజశేఖర్ అన్నారు. రాయకుదురు జెడ్పీ హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన , పఠనాశక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించుటకు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు హెచ్‌ఎం కానుకొలను శ్రీనివాసరావు, వీరవల్లి నాగేశ్వరరావు, వేల్పూరి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి వరకు సాంఘికశాస్త్రానికి సంబంధించి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వేల్పూరి వెంకటాచార్యులు, కాయల వీరాస్వామి, ఆర్.తులసీప్రదీప్ పాల్గొన్నారు.



కాళ్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారావు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది జ్యోతి



మెప్మా ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరంలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న దేవానంద్

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలి

భీమవరం: సార్వా ధాన్యం మాసూళ్లు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు కార్యాచరణ సమితి నాయకులు కోరారు. ఆదివారం భీమవరం నిర్వహించిన సమితి సమావేశంలో అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు మాట్లాడుతూ దాళ్వా సీజన్‌కు ముందుగానే డ్రెయిన్స్ ఆధునికీకరణ చేపట్టాలని కోరారు. భూముల రీసర్వేలో ఇబ్బందుల పరిష్కారానికి మరొమారు సర్వే చేయాలని మురళీరామరాజు కోరారు. సమితి అధికార ప్రతినిధి కె.కమలాకర్‌శర్మ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నూతన విధానాలు అవలంబిస్తున్నందున రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం తూకం సమయంలోనే రశీదులు తీసుకోవాలన్నారు. రైతులకు అధిక ఆదాయమిచ్చే నూతన వరి వంగడాలను అందించాలన్నారు. మేళం దుర్గాప్రసాద్, రైతు సంఘం నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు, నల్లం నాగేశ్వరరావు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, భూపతిరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఉండి: కలిగొట్లలో పేకాటస్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పర్వ దీపోత్సవం ఆదివారం కన్నులపండుగగా జరిగింది. ఏటా కార్తీకమాసంలో పౌర్ణమి రోజున నిర్వహించే వేడుకకు దేవస్థానంలో వైభవోపేతంగా ఏర్పాట్లు చేశారు. దీపాల వెలుగులో శ్రీవారి ఆలయం దేదీప్యమానంగా వెలిగింది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనల అనంతరం ఈ దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్తీక దీపోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలు నుంచి పెద్ద ఎత్తున మహిళలు భక్తులు హాజరై దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాపాలను హరించే జ్వాలా తోరణం

ఆకివీడు: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక పార్వతి సమేత వేంకట లింగేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మొవ్వా సుబ్రహ్మణ రవి మాట్లాడుతూ పార్వతీ దేవి జ్వాలా తోరణం కింద నుంచి వెళ్లి పరమశివుడ్ని ప్రమాదం నుంచి రక్షించిన విషయాన్ని పురాణాలు చెబుతున్నాయన్నారు. స్థానిక భీమేశ్వరస్వామి ఆలయం వద్ద వంశపారంపర్య ఆనవాయితీ ప్రకారం పువ్వాడ రాజా అమర్‌నాథ్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి జ్వాలా తోరణం వెలిగించారు. మాదివాడ శివాలయం, జవహర్‌పేటలోని మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం గునుపూడిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దాత అజ్జంపూడి బాబురావు సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు గ్రంధి రవితేజ ప్రారంభించారు. ముందుగా ఆయన స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అన్నారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు, పార్టీ పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పోలిశెట్టి దాసు, ఆలయ పాలకవర్గ సభ్యులు చెల్లబోయిన సూర్యప్రకాష్, నాచు శ్రీవల్లి, తానాల రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి



బంగారు పుష్పాల అలంకరణలో కాళ్లకూరు వెంకన్న



మాదివాడ శివాలయంలో జ్వాలాతోరణం దృశ్యం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న గ్రంధి రవితేజ

రోగులకు వైద్య పరీక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడ వైద్యులు డాక్టర్ డి.సందీప్ వర్మ పాల్గొని వైద్య సేవలు అందించారు. తక్కువ ధరలకే అవసరమైన ఔషధాలను, ఇన్సులిన్ అందించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో ఉచితంగా మందులను అందజేశారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు, ట్రస్టీ బి.వాసుదేవరావు, ఎం.శ్రీనివాస్, అజయ్ కుమార్, సీతారామరాజు, సాహితీ స్రవంతి కన్వీనర్ చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్‌సీసీ కాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన కాడెట్లకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు జి.పాండురంగరాజు, ప్రిన్సిపాల్ బి.శాంతకుమారి, కె.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ.వీరయ్య, కొత్తపల్లి శివరామరాజు పాల్గొన్నారు.

'మహాపడావ్' విజయవంతం చేయాలి

భీమవరం: కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖాన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మహాపడావ్ సభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో బజారు హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. పిన్నింటి శ్రీనివాస్, బాబురావు, పి.కనకరాజు పాల్గొన్నారు.

ఐఈఎస్ టాపర్ శివకు సత్కారం

ఆకివీడు: పేద కుటుంబంలో పుట్టి ఉన్నత శిఖరాల్ని అధిరోహించిన ఐఈఎస్ టాపర్ చినమిల్లి శివన్నారాయణ (శివ)ను ఆదివారం కుప్పనపూడిలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ శివ మరిన్ని ఉన్నత ఉద్యోగాలు చేపట్టి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. తమ స్కూల్‌లో 5 నుంచి 10వ తరగతి వరకూ చదివిన శివ ఐఈఎస్‌లో 5వ ర్యాంకర్‌గా నిలవడం తమ గ్రామానికి గర్వకారణంగా ఉందని ధరణీ స్కూల్ ప్రిన్సిపాల్ కట్రెడ్డి ఏడుకొండలు అన్నారు. అనంతరం శివను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ ముత్యాల అనురాధ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం పాల్గొన్నారు.



శివన్నారాయణను సత్కరించిన గ్రామస్తులు

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషకు సత్కారం

భీమవరం: ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ గణేశ్న ప్రత్యూషను ఆదివారం భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో సీసలిలో సత్కరించారు. క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో–కన్వీనర్ ఓలేటి శ్రీనివాస గుప్తా, క్లబ్ సభ్యులు కార్మూరి సత్యనారాయణమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శృంగవృక్షంలో ఉచిత వైద్య శిబిరం

పాలకోడేరు: శృంగవృక్షంలో శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వ్యాస్కులర్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 300 మంది వెరికోస్ వెయిన్స్‌తో బాధపడే వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సూర్యప్రకాశరావు, సోము రామకృష్ణ చెప్పారు. హాస్పిటల్ ఎండీ, వాస్క్యులార్ సర్జన్ డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సోమాచారి వైద్య పరీక్షలు చేశారు. సుమారు వంద మందికి సర్జరీ అవసరమని, వీరికి ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. శిబిరంలో ఆస్పత్రికి చెందిన నవీన్ రాజారావు, వైద్య సేవలు అందించగా, ఆర్య వైశ్య సంఘానికి చెందిన గ్రంధి రాజా, యానాదిసెట్టి, గ్రంధి రాము, పూర్ణారావు పాల్గొన్నారు. ఇతర వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ షేక్ అలీం 7673942005 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీఅన్నపూర్ణ పశ్చిమ గోదావరి జిల్లా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక పట్టణంలో ఆదివారం జరిగింది. అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కోపెల్ల రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చిట్టూరి రాము, ఉపాధ్యక్షులుగా సీహెచ్ శ్రీనివాస్, తాటికొండ పాండురంగారావు, చాపల సత్యనారాయణ, వీర వెంకట పుష్కరం, మేక సత్యనారాయణ, కోశాధికారిగా వీరవల్లి వీరరాఘవులు, జాయింట్ సెక్రటరీలుగా రమేష్, మోహన్, విజయ, గౌరవ సలహాదారుగా ఎంపైర్ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా పరుచూరి మాధవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికులకు మాదిరిగానే టైలర్స్ కూడా పథకాలు అమలు చేయాలన్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షులు బి.భాస్కర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎస్.సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎండీ హుస్సేన్ పాల్గొన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం: పట్టణంలో బాలోత్సవాన్ని డిసెంబర్ 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం బాలోత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీ గౌరవాధ్యక్షునిగా వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు వ్యవహరిస్తారన్నారు. బాలోత్సవం నిర్వహణకు వివిధ కమిటీలు ఏర్పాటు చేసి బాలలకు ఉల్లాసం, ఉత్సాహం కలిగించే విధంగా నిర్వహించాలన్నారు. అనంతరం బాలోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గుండు నారాయణరావు, డీవీ రాజు, జీవీఎల్ నర్సింహరావు, రేపాక వెంకన్నబాబు, భూలక్ష్మి, అనురాధ, పి సీతారామరాజు, మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనం సభను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉండి: కలకాలం నిలిచేది చిన్ననాటి స్నేహం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. మహాదేవపట్నం హైస్కూల్‌లో 1995–96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు ధర్మరాజు, విజయరామరాజు, సుదర్శన్, సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల విద్యలో కులం, మతం అనేవి కనిపించవన్నారు. కష్టం వచ్చినా సుఖం శాశ్వతంగా ఉండేది స్నేహమేనన్నారు. బాల్యమిత్రులంతా ఒకచోటకు చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. నాటి మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకుని సరదాగా గడిపారు. గురువులు సామల సత్యనారాయణ, రుద్దరాజు ధర్మరాజు, విజయరామరాజు, సుదర్శనలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. బీఐఐ న్యూటన్, విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. కలిదిండి రాజా, తోట శ్రీనివాస్, వాణిమ శ్రీనివాస్, వేగేశ్న వెంకటరామరాజు, సోడరాజు స్వప్న, తంగేళ్ల గీత, సోనీ, సోడరాజు శ్రీకళ ఏర్పాట్లను పర్యవేక్షించారు.